కర్నూలు బస్టాండులో దుర్వాసన...

- డ్రెయినేజీ అస్తవ్యస్తం - ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు - పట్టించుకోని ఆర్‌టిసి అధికారులు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

అధికారుల నిర్లక్ష్యంతో కర్నూలు బస్టాండ్ 19 ,20 ప్లాట్ ఫామ్‌ల వద్ద డ్రెయినేజీ నీరు రోడ్లపై ప్రవహిస్తూ ముక్కుపుటాలు అదిరే దుర్వాసన వస్తుంది. ప్రజల ఆరోగ్యం పాడయ్యే ప్రమాదం ఉంది. ప్రధానంగా బస్టాండు ఆవరణలో ఉన్న హోటళ్లలో మిగిలిపోయిన వ్యర్థాలను కాలువలో పడేస్తున్నారు. దీంతో కాలువలు సక్రమంగా లేక నీరుకదలక వ్యర్థాలు మురిగిపోయి దుర్వాసన వస్తుంది. యూరినల్స్ కోసం సరిపడా వ్యవస్థ లేకపోవడంతో ప్రయాణికులు ఎక్కడపడితే అక్కడ యూరిన్ పోస్తుడటం కూడా ఒక కారణం. అధికారుల సమన్వయలోపం నిర్లక్ష్యం రెండు తోడై ప్రయాణికుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. బస్టాండు ఆవరణలో కేవలం పారిశుధ్య కార్మికులు ప్లాట్ఫాములవరకే శుభ్రత చేస్తూ ఉండడంతో చుట్టూ పరిసర ప్రాంతాలు చెత్తాచెదారంతో, ప్రయాణికులు యూరినల్స్ ఉపయోగించుకునేందుకు కూడా వీలు లేకుండా మరుగుదొడ్లు తయారయ్యాయి. నిర్వహణ బాధ్యతలు తీసుకున్న గుత్తేదారులు సైతం

అధికారుల అలసత్వంతో పనిచేయకుండా తయారయ్యారు. తెలంగాణ ఆర్‌టిసి కంట్రోలర్ ప్రసాద్ ప్రజాశక్తితో మాట్లాడుతూ తాను బస్టాండ్ స్టేషన్ మేనేజర్ పోలయ్యకు తెలియజేశానని చెప్పారు. అయినా ఏమి పట్టించుకోవడం లేదని, విధిలేని పరిస్థితిలో ఇక్కడ డ్యూటీ చేస్తూ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్టేషన్ మేనేజర్ పోలయ్యను ప్రజాశక్తి సంప్రదించగా తాను సంబంధిత పని వారికి చెప్పినా ఈ పని చేయలేమని చేతులెత్తేసారని తెలిపారు. డిఇ వెంకటేశ్వరరావును సంప్రదించగా సంబంధిత అధికారి పోలయ్య ఆ విషయం పై చర్యలు తీసుకోవాలి, ఆ పని చేయను అనే వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు రాయాలన్నారు. శాశ్వత పరిష్కారం చేయలేరా అని ప్రశ్నించగా అనుపమ హోటల్, మురళీకష్ణ థామస్ లాడ్జిల ద్వారా వచ్చే వ్యర్థపు నీరు , వాటి ద్వారా వచ్చే వ్యర్థాల కోసం పందికొక్కులు దూరి మట్టిని తవ్వేస్తున్నాయని, దాంతో డ్రెయినేజీ ఎక్కడికక్కడ నిలిచిపోయి నీరు రోడ్లపైకి ప్రవహిస్తుందని తెలిపారు. చివరకు త్వరలో ఆ పనిని చేసి ప్రయాణిలకు ఇబ్బందులు లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు.

ముక్కు మూసుకొని కూర్చోవాల్సిందే

- ప్రయాణికుడు, మద్దిలేటి కొత్తకోట

బస్సుల కోసం ఎదురుచూస్తూ ఇక్కడ కూర్చోవాలంటే వాసన భరించలేక ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు పట్టించుకోవాలి.

కంపు భరించలేకపోతున్నం

- ప్రయాణికురాలు మద్దమ్మ బొంకూరు

ఊరికి పోవాలని వచ్చాం నాయినా బస్సు రాలేదు.. ఇక్కడ కూర్చుంటే కంపును భరించలేక ముక్కు మూసుకుని కూర్చోవాల్సి వస్తుంది. ఇక్కడే ఒక గంట సేపు ఉంటే మా ఆరోగ్యం పాడయ్యేలా ఉంది. వాసనకు తల తిరుగుతుంది.

డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

- సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు

ఆర్‌టిసి అధికారులు లాభార్జన ధ్యేయంగా ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ షాపులు హోటళ్లు లాడ్జీలు నిర్మించి ఇవ్వడం పట్ల ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యం పట్ల చూపడం లేదు. బస్టాండ్ నిర్మాణం చేసినప్పుడు ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను విస్తరించకుండా అలాగే కొనసాగడం వల్ల ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఇప్పుడున్న పరిస్థితుల కనుగుణంగా డ్రెయినేజీ వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉంది. అప్పుడే సమస్య పరిష్కారం అవుతుంది.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

బిజెపికి తొత్తులుగా మారిన వైసిపి, టిడిపి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్రంలోని బిజెపికి వైసిపి, టిడిపిలు తొత్తులుగా మారాయని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి విమర్శించారు. కర్నూలు పాత బస్తి సిపిఎం సర్వసభ్య సమావేశం నగర కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ మొహమ్మద్ షరీఫ్ అధ్యక్షతన నిర్వహించారు. గౌస్ దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల మాట్లాడారు. కేంద్రప్రభుత్వ విధానాలను అమలు చేయడంలో వైసిపి, టిడిపి ఉవ్విల్లూరుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కి కుర్చీ తగాదా కోసం పోటీపడుతూ నరేంద్ర మోడీకి సాష్టాంగ ప్రణామాలు చేస్తున్నారని అన్నారు. కేంద్రం రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా తుంగలో తొక్కినా, ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా, అమరావతి రాజధాని అభివృద్ధి కోసం నిధులు ఇవ్వకపోయినా, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టకపోయినా వైసిపి, టిడిపినేతలు నోరు మెదపడం లేదన్నారు. బిజెపికి మద్దతు ఇస్తూ ప్రజలకు వ్యతిరేకంగా పార్లమెంటులో నరేంద్ర మోడీ తీసుకువస్తున్న చట్టాలన్నిటికీ ఇతర రాష్ట్రాల ఎంపీల కంటే ఆంధ్ర రాష్ట్రంలోని వైసిపి, టిడిపి ఎంపీలు ముందే బలపరచడం దేనికి సంకేతమని అన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని ఢిల్లీ గద్దె నుంచి తక్షణమే దింపాలని, బిజెపికి మద్దతు ఇస్తున్న ఏ పార్టీ అయినా సరే దానికి కూడా ఓడించాలన్నారు. అందుకోసం ఈనెల 15న జరిగిన ప్రజా రక్షణ భేరిలో పలు నిర్ణయాలు చేశామన్నారు. సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం నవరత్నాలు తప్ప ఎటువంటి అభివృద్ధిని చేయడం లేదన్నారు. విశాఖ ఉక్కుపరిశ్రమను ప్రైవేట్ పరం చేస్తామంటే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సరైన విధానం ప్రకటించలేదన్నారు. డిసెంబర్ 15, 16, 17 తేదీలలో ఎఐకెఎస్ జాతీయస్థాయి కౌన్సిల్ సమావేశాలు నగరంలో నిర్వహించాలని జాతీయ కౌన్సిల్ తీర్మానించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఆతిథ్యం ఇవ్వడానికి మరొకసారి అవకాశం వచ్చిందన్నారు. నగరంలోని వివిధ రకాల వ్యాపారవేత్తలు, మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మధ్యతరగతి ప్రజలు కార్మికులు, యువకులు, ప్రతి ఒక్కరు కూడా ఈ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయడానికి ఆర్థికంగా, హార్థికంగా సహాయ సహకారాలు అందించాలన్నారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు డి.అబ్దుల్‌దేశాయ్, కె.రామకృష్ణ, ఎం.విజయ్, ఖాజా పాషా, మహబూబ్ బాషా, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, వైసిపి మధ్య ఘర్షణ

- టిడిపి జెండా కట్టకు వైసిపి రంగులు వేయడంపై రగడ
- అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి అరెస్టు
- మాధవరం పోలీసు స్టేషన్ వద్ద శ్రీనివాస్ రెడ్డి నిరసన
- శ్రీనివాస్ రెడ్డిని అరెస్టు చేసి మంత్రాలయం తరలించిన సిఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం గ్రామంలో పార్టీ జెండా విషయంలో టిడిపి, వైసిపి మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఆదివారం వైసిపి నాయకులు, మాజీ జడ్‌పిటిసి రాజశేఖరరెడ్డి టిడిపి జెండాకు వైసిపి రంగులు వేసేందుకు ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, నాయకులు కృష్ణ మోహన్ రెడ్డి టిడిపి జెండాకు వైసిపి రంగులు వేయడాన్ని అడ్డుకోవడంతో రగడ మొదలైంది. గతంలో టిడిపిలో ఉన్న రాజశేఖరరెడ్డి వైసిపిలోకి మారారు. మాధవరం సర్కిల్‌లో గతంలో తనకు చెందిన స్థలంలో టిడిపి జెండా కట్టను కట్టామని, ప్రస్తుతం వైసిపిలో ఉన్నందున వైసిపి రంగులు వేస్తున్నామని రాజశేఖరరెడ్డి వాదించారు. జెండా కట్ట ఉన్న స్థలం పూర్తిగా ఆర్ అండ్ బి స్థలంలో ఉందని, రాజశేఖరరెడ్డికి సంబంధం లేదని అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ కిరణ్ బాబు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అమర్‌నాథ్‌రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి తదితరులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి పోలీసు స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఆందోళన ఉధృతం కావడంతో శ్రీనివాస్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, ఎల్లారెడ్డి, చావిడి వెంకటేష్‌ను అరెస్టు చేసి మంత్రాలయం పోలీసు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, బూదూరు మల్లికార్జున రెడ్డి పోలీసు స్టేషన్ చేరుకొని డీఎస్పీ సీతారామయ్యతో వాగ్వాదానికి దిగారు. టిడిపి జెండా కట్టకు వైసిపి రంగులు ఎలా వేస్తారని, ఇది న్యాయమా అని ప్రశ్నించారు. వైసిపి నాయకులు కావాలనే ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నారని తెలిపారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. అనంతరం ఎన్నో ఏళ్ల గా ఉన్న టిడిపి జెండా కట్టపై రేపటి వరకు వ్యవధి ఇవ్వాలని డీఎస్పీ సీతారామయ్య, సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు కోరినట్లు తిక్కారెడ్డి తెలిపారు. టిడిపి జెండా కట్టకు వైసిపి రంగులు వేయడంపై తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారని, అంతవరకు టిడిపి శ్రేణులు ఆవేశ పడొద్దని కోరారు. అరెస్టు చేసిన టిడిపి నాయకులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా రాగా నియంత్రణకు పోలీసు బలగాలు రంగంలోకి దిగాయి. టిడిపి నాయకులు చెన్నబసప్ప గౌడ్, వెంకటపతి రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

పోలీసులతో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

డిసెంబర్‌లో లా యూనివర్సిటీకి శంకుస్థాపన

- ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

డిసెంబర్ నెలలో యూనివర్సిటీకి సీఎం శంకుస్థాపన చేయనున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. ఆదివారం నగర శివారులలోని జగన్నాథ గట్టు సమీపంలో లా యూనివర్సిటీకి ఏర్పాటుకు సంబంధించి స్థలాన్ని మంత్రి బుగ్గన పరిశీలించారు. జగన్నాథగట్టు పైన త్వరలోనే న్యాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. రూ.600 కోట్లతో 250 ఎకరాలలో నిర్మించబోయే లా యూనివర్శిటీకి సంబంధించి డిసెంబర్‌లో భూమి పూజ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 'లా' విద్యార్థులు ఇక్కడ న్యాయ విద్యను అభ్యసించేందుకు వీలుంటుందన్నారు. ముఖ్యమంత్రి పునాది రాయి వేయడానికి కర్నూలు వస్తే అక్కడ రహదారులు సహా ఇతర కనీస సదుపాయాలలో లోటు రాకుండా ఏర్పాటుపై ఇప్పటినుంచే దృష్టి సారించాలని ఆర్ అండ్‌బి అధికారులు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, సభ ఏర్పాటుకు అనుకూల స్థలం, పునాది రాయి వేసే చోటు తదితర ఏర్పాట్లకు అనువైన స్థలాలను మంత్రి బుగ్గన నిశితంగా పరిశీలించారు. మంత్రి వెంట విశ్రాంత అర్ అండ్‌బి ఎస్‌ఇ జయరామి రెడ్డి, ఆర్ అండ్‌ఇ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎవి.శ్రీధర్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిర్మల్ కుమార్, ఎఇ స్వామిరెడ్డి పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

భూ సమస్యలు పరిష్కరిస్తాం

- జిల్లాలో 3000 ఎకరాలు భూ పంపిణీ - బోగస్ ఓటర్లను తొలగిస్తాం
- కలెక్టరేట్ ఆధునీకరణ పనులు త్వరగా పూర్తి
- ప్రజాశక్తితో డిఆర్‌ఒ మధుసూదన్ రావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

'జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా దృష్టి సారించాం. తహశీల్దార్ విఆర్‌ఒ స్థాయిలోనే సమన్వయం చేసి రెవిన్యూలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో దాదాపుగా ఇటీవల అసైన్‌మెంట్ కమిటీ ద్వారా మూడు వేల ఎకరాలు భూ పంపిణీ చేశాం. బోగస్ ఓటర్లు లేకుండా ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నాం.' అని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు అన్నారు. ప్రజాశక్తితో జిల్లా రెవెన్యూ అధికారి ముఖాముఖి వివరాలు...ఆయన మాటల్లో.....

జిల్లాలో అసైన్మెంట్ కమిటీ ద్వారా పేదలు సాగు చేసుకున్న భూములకు ఎంతమందికి పట్టాలు అందజేస్తున్నారు?.

డిఆర్‌ఒ : భూమి లేని నిరుపేదలకు జిల్లాలో 2582 మంది లబ్ధిదారులకు 3002.18 ఎకరాలకు(ఆదోని డివిజన్ లో 1330 మంది లబ్ధిదారులకు - 1375.45 ఎకరాలు, పత్తికొండ డివిజన్ లో 932 మంది లబ్దిదారులకు - 1203.99 ఎకరాలు, కర్నూలు డివిజన్ లో 320 మంది లబ్ధదారులకు - 422.74 ఎకరాల) పట్టాలు పంపిణీ చేస్తున్నాం.

జిల్లాలో 22 ఏ కింద ఉన్నటువంటి భూములకు పూర్తిస్థాయి హక్కులు కల్పిస్తున్నారా లేదా?

డిఆర్‌ఒ : 22(ఎ) ఉన్నటువంటి భూములను గుర్తించి- ఆదోని డివిజన్లో 702.71 ఎకరాలు, పత్తికొండడివిజన్ లో 2277 మంది లబ్ధదారులకు - 4540.57 ఎకరాలు, కర్నూలు డివిజన్‌లో 342 మంది లబ్ధదారులకు - 538.095 ఎకరాలకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పిస్తున్నాం.గ్రామ సర్వీస్ ఇనామ్‌లకు 22(ఎ) నుంచి తొలగించడానికి సంబంధించి 15191 మంది లబ్ధిదారులకు 23,838.92 ఎకరాలు కల్పిస్తున్నాం.

జిల్లాలో అనేక గ్రామాల్లో దళితవాడలో స్మశానవాటికలు లేకుండా తీవ్ర అవస్థలు పడుతున్నారు. అలాంటి వాటికి ప్రత్యేకంగా ఏమైనా భూములను గుర్తించారా?

డిఆర్‌ఒ : ఇటీవల కాలంలో దళితులకు స్మశాన వాటికలను ఏర్పాటు చేసేందుకు తహశీల్దార్లకు స్థలాలను గుర్తించాలని ఆదేశాలు ఇచ్చాం. ఇటీవల కాలంలో ఎస్సీ కమ్యూనిటీకి 103 స్మశాన వాటికలు గుర్తించాం.

జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ఎలా జరుగుతుంది? బోగస్ ఓటర్ల తొలగింపుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఆర్‌ఒ : ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఫార్మ్-6 కు సంబంధించి 36,773, ఫార్మ్-7కు సంబంధించి 24,816, ఫార్మ్-8 కు సంబంధించి 17,592 వరకు పెండింగ్ ఉన్నాయి. ఒకే ఇంట్లో 10 మంది కంటే ఎక్కువ ఓటర్లు, జంక్ క్యారెక్టర్స్ మీద దృష్టి సారించి వాటిపై పరిశీలన జరుగుతోంది. బోగస్ ఓటర్లు జాబితాలో నమోదు కాకుండా చర్యలు చేపట్టాం . బిఎల్‌ఒలతో పాటు బూతులెవల్ ఏజెంట్ల ద్వారా ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతుంది.

కలెక్టరేట్ ఆధునీకరణ పనులు ఎంతవరకు వచ్చాయి. ఎప్పటిలోగా ఈ పనులను పూర్తి చేస్తారు.?

డిఆర్‌ఒ : కలెక్టరేట్లోని అన్ని శాఖలకు చెందిన భవనాల మరమ్మతుల పనులను చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. రెండు మూడు నెలల్లోగా ఈ ఆధునీకరణ పనులను పూర్తి చేసి అన్ని వసతులు కార్యాలయాల్లో కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఎస్ఎఫ్ఐ నగర మహాసభలో మాట్లాడుతున్న టి.నరసింహా

ఎన్‌సిపిని రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యార్థులకు విద్యను దూరం చేసే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.నరసింహ అన్నారు. ఆదివారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర మహాసభలు సాయిఉదయ్ అధ్యక్షతన నిర్వహించారు. నరసింహ , ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ కర్నూలు జిల్లా విద్యాభివృద్ధిలో వెనుకబడిన జిల్లాగా ఉందన్నారు. శాస్త్రీయమైన విద్యావిధానానికి ఎస్ఎఫ్ఐ పాటుపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న విద్యా వ్యతిరేక విధానాలపై విదేశీ , ప్రైవేటు యూనివర్సిటీల వంటి ప్రతిపాదనలను ఎస్ఎఫ్ఐ వ్యతిరేకిస్తుందాన్నరు. ప్రభుత్వ యూనివర్సిటీలకు యుజిసి నిబంధనలను పెంచి బలపరచాలని డిమాండ్ చేస్తుందన్నారు. విద్యా బోధనలో శాస్త్రీయత ఉండేవిధంగా ఉండాలని, మత భావాలను చొప్పించ వద్దని, విద్య వ్యాపారీకరణ, కాషాయీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. కొఠారి కమిషన్ సిఫారసులకు అనుగుణంగా విద్యారంగానికి జిడిపిలో 6శాతం కేంద్ర బడ్జెట్లో 10శాతం రాష్ట్ర బడ్జెట్లో 30శాతం నిధులను విద్యారంగానికి కేటాయించాలన్నారు. అందరికీ విద్యా కావాలని విద్య హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 77 తెచ్చి పేద విద్యార్థులు చదువు దూరం చేస్తుందన్నారు. ఆజిఒను రద్దు చేయాలన్నారు. కర్నూలు జిల్లా విద్యార్థులకు కరువు స్కాలర్షిప్ కింద రూ.పదివేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాటాలతో పాటు, సేవా, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎన్ఎఫ్ఐ నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్ష కార్యదర్శులుగా అమర్, సాయి ఉదయ్ ఉపాధ్యక్షులుగా అబుబక్కర్ , భాస్కర్ సహాయ కార్యదర్శులుగా మల్లేష్ , ఆర్యన్ ,సిటీ కమిటీ సభ్యులుగా తేజ , వీరేష్ , యోగి , వీరేష్ , చంద్రశేఖర్ , రాజు , యువరాజ్ , వినోద్ , ఎలా కృష్ణ, రంగనాథ్ ఎన్నుకోన్నారు. ఈ సమావేశంలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి నీటి శుక్లాల పట్ల జాగ్రత్త తీసుకోవాలి

కంటి వైద్యులు డాక్టర్ పి.సుధాకర్ రావు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని బుధవారం పేటలో సుశీల నేత్రాలయ ఆసుపత్రిలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత డయాబెటిక్ రెటీనోపతి శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన వంద మంది రోగులకు రెటినోపతి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుశీల నేత్రాలయ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ పి.సుధాకర్ రావు మాట్లాడుతూ భారత దేశంలో 101 మిలియన్ ప్రజలు డయాబెటిక్ తో బాధపడుతున్నారని, వారందరికీ నీటి శుక్లాలు , శాశ్వత అంధత్వానికి దారి తీసే డయాబెటిక్ రెటినోపతి రావచ్చని తెలిపారు. కార్యక్రమంలో సుశీల నేత్రాలయ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ సుధాకర్ రావు

కరువు సహాయక చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా క్రిష్ణగిరి,తుగ్గలి, కర్నూలు మండ లాలను కరువు మండలాలుగా ప్రకటించి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి .నిర్మల డిమాండ్ చేశారు. కార్మిక కర్షక భవన్‌లో సిపిఎం కల్లూరు, ఓర్వకల్, వెల్దుర్తి మండలాల జనరల్ బాడీ సమావేశం మధు అధ్యక్షతన నిర్వహించారు. పి.నిర్మల ,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రామకృష్ణ మాట్లాడుతూ తీవ్రమైన కష్టాల్లో కూరుకుపోయిన రైతులు, వ్యవసాయ కూలీలు జిల్లా నుండి పిల్లాపాపలతో కలిసి వలస వెళ్లకుండా నివారించడానికి ప్రభుత్వం తక్షణమే కరువు సహాయక చర్యలను చేపట్టి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికార ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు వెనకబడిన ప్రాంత ప్రజలే పాలకులు నిద్రలేపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూస్తే ప్రయోజనం లేదని వెంటనే పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఎకరాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25వేలు, కేంద్రం రూ.25 వేలు ఇవ్వాలని, కూలీలకు కూడా కరువు భత్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ప్రజల వద్దకు వెళ్లి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నగేష్, ఓర్వకల్ మండల కార్యదర్శి నాగన్న, ఓర్వకల్ కల్లూరు వెల్దుర్తి మండల నాయకులు శ్రీధర్,చంద్రబాబు, కృష్ణ లక్ష్మన్న, ధర్మ రెడ్డి, గోపి, శీను, మారెన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పి.నిర్మల

రెండో విడతలో 630 పోన్ల రికవరీ

బాధితులకు అందజేసిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రెండవ విడతలో 630 మొబైల్స్ (విలువ రూ.1 కోటి 26 లక్షలు) విలువచేసే రికవరీ చేశామని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కష్ణ కాంత్ తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం ... 1,282 మొబైల్స్ రికవరీ చేశామని (వాటి విలువ 2 కోట్ల 56 లక్షలు) అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో " మొబైల్ రికవరీ మేళా " కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పోగోట్టుకున్న మొబైల్ ఫోన్లను ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి రికవరి చేసి భాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోతే ...http://Kurnoolpolice.in/mobiletheft లింకు ను క్లిక్ చేసి మొబైల్ వివరాలను తెలియజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్ అనేది మన జీవితంలో ఒక భాగంగా ఉందని, మొబైల్ కోనుగోలు చేసినప్పటి నుండి ప్రతి ఒక్కటి మొబైల్‌లో నిక్షిప్తమై ఉంటుందని, కష్టపడి కోనుగోలు చేసిన తర్వాత మొబైల్ పోగోట్టుకుంటే కలిగే బాధ, ఆవేదన మనందరికి తెలుసన్నారు. పర్సనల్ వివరాలు, ఫోటోలు, ఫోన్ నెంబర్లు, వ్యాపార లావాదేవిలు, అటాచ్ మెంట్స్, సెంటిమెంట్స్, ఆన్ లైన్ బ్యాంకు ఖాతా వ్యవహారాలు, ఇలా చాలా మిస్ అవుతారన్నారు. వారి ఆవేదనను దష్టిలో ఉంచుకుని మొబైల్ ఫోన్లను కర్నూలు పోలీసులు కష్టపడి రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నామని, రికవరీ చేసి అందించడం సంతోషంగా ఉందన్నారు. క్షేత్రస్థాయి నుండి కింది స్థాయి సిబ్బంది వరకు ఫీల్డ్ లో ఉండి ఎంతో కష్టపడి పని చేస్తేనే ఈ ఫలితం వస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు , కర్నాటక రాష్ట్రాలను నుండి మొబైల్స్‌ను రికవరీ చేశామని అన్నారు. రెండవ విడతలో 630 (విలువ రూ.1 కోటి 26 లక్షలు)మొబైల్ ఫోన్లను రికవరీ చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్క పోలీసును , ప్రత్యేకంగా సైబర్ ల్యాబ్ పోలీసులను అభినందిస్తున్నాం.

సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి : హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వైసిపి చేపట్టిన సంక్షేమ పథకాలు , అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. ఆదివారం ఆయన ఎనిమిది, పది వార్డుల కార్పొరేటర్, స్థానిక నాయకులతో జెసిఎస్ మండల్ ఇంచార్జి, క్లస్టర్ ప్రెసిడెంట్, సచివాలయం కన్వీనర్లు గృహసారథులతో, వార్డు సామాన్య ప్రజలతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలు నగరంలో నాడు నేడు ద్వారా ఎన్నో పనులు పూర్తి చేశామన్నారు. హాస్పిటల్స్, పార్క్స్, పాఠశాలలు, రోడ్స్, బ్రిడ్జిస్, అర్బన్ హెల్త్ సెంటర్స్, రూపు రేకులు మార్చామని, కరోనా కష్టకాలంలో కర్నూలు నగర ప్రజలకు ఆక్సిజన్స్ కాన్సన్‌ట్రేటర్స్, ఆక్సిజన్ ప్లాంట్స్, ఫ్రీ అంబులెన్సు,సేవలు అందించం అభివృద్ధి పనులు, ఎన్నో చేశామని, మరిన్ని పనులను చేపట్టబోతున్నామన్నారు. వార్డు సమస్యలను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. జరగబోయే పనులను త్వరలో పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు స్థానిక వార్డు ప్రజలు తెలుపగా ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ వెంటనే పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 10వ వార్డ్ కార్పొరేటర్ యూనుస్ బాషా, 8వ వార్డ్ ఇంచార్జి, జిల్లా వక్ఫ్ బోర్డు మెంబర్ అబ్రర్, పర్వేజ్ ఖాన్, ఫరూక్, షాకీర్, షాభీర్, ఫైరోజ్, మున్నా,10వ వార్డ్ నాయకులు నజీర్ అలీ ఖాన్, సోహైల్ బాబ, షబ్బీర్ ఖాన్, షేక్ సమీర్, జావీద్, జెసిఎస్ మండల్ ఇంచార్జి ఏజాస్ అలీఖాన్, సతీష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హాఫీజ్‌ఖాన్

బురాన్ దొడ్డిలో సరస్వతి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -సి బెళగల్ : బురాన్‌దొడ్డి హైస్కూలు లో 1990-94 పూర్వ విద్యార్థులు అపురూపమైన సరస్వతి దేవి విగ్రహం ఆదివారం ఘనంగా ప్రతిష్టించారు. ఇందుకు 1990-94 పూర్వవిద్యార్థుల బృందం నిర్వాహకులు గడియారం చంద్రశేఖర్, యాదవ్ రెడ్డి, ఉమాదేవి, నరసింహులు, సూర్ల రుక్మాంగద, కరణం అనిల్‌కుమార్, రమేష్ నాయుడు వారి పూర్వ ఉపాధ్యాయులను ఆహ్వానించి ఎంఇఒ ఆదం బాషా సమక్షంలో విగ్రహ ప్రతిష్ట చేశారు. ఉపాధ్యాయులు నాగరత్నం శెట్టి, సాజహాన్, రమేష్, మద్దయ్య, కృష్ణయ్య, వెంకటేష్, ఆదిలక్ష్మి తది తరులకు ఘన సన్మానం చేశారు. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పీఠాధిపతులు

సాయం చేసే వారు ఎప్పుడూ బాగుంటారు

- బాపురే హోటల్ భూమి పూజలో ప్రముఖులు

ప్రజాశక్తి - మంత్రాలయం

అందరూ బాగుండాలని సహాయం చేసేవారు ఎప్పుడూ బాగుంటారని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు, రాజ్యసభ సభ్యులు టిజి.వెంకటేష్, టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని కలుదేవకుంట గ్రామ సమీపంలో బిపిఆర్ ఫార్మ్ హౌస్ వద్ద సుప్రీం కోర్టు న్యాయవాది, బిజెపి రాష్ట్ర నాయకులు బి.పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో బాపురే హోటల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మంత్రాలయం వస్తారని తెలిపారు. భక్తులకు మంచి వసతి, భోజన సదుపాయం అందుబాటులో ఉంచి పేరు సంపాదించాలని సూచించారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా పెరుగుతోందని తెలిపారు. హోటల్ నిర్మాణం భక్తులకు ఉపయోగకరమన్నారు. త్వరలో బైపాస్ రోడ్డు రానుందని, ఒక ప్రయివేట్ వ్యక్తి సమీపంలో ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టబోతున్నారని చెప్పారు. గతంలో ఇక్కడ కర్నూలుకు రైల్వే లైన్ కూడా సర్వే జరిగిందని, భవిష్యత్తులో రైల్వే లైన్ కూడా వస్తుందని తెలిపారు. పలు అభివృద్ధి పనుల వల్ల భూముల ధరలు అమాంతంగా పెరిగాయని చెప్పారు. పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ... తన తండ్రి బివిఆర్.రెడ్డి భాగాలు పంపిణీ చేసిన సమయంలో ఈ భూమికి విలువ లేదని తెలిపారు. అప్పుడు అన్నదమ్ములు బాగుండాలని భావించి తన భూమి ఇచ్చానని చెప్పారు. పనికి రాని భూమిగా భావించిన ఈ భూమి రూ.కోట్ల విలువ చేస్తోందని తెలిపారు. బిజెపి నాయకులు మురహరిరెడ్డి, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, బిజెపి నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పని చేద్దాం

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప

ప్రజాశక్తి-ఆలూరు

సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రగౌడ్, వెంకప్ప

ఆలూరు నియోజక వర్గంలో గెలుపే ధ్యేయంగా టిడిపి, జనసేనగా పని చేద్దామని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, జనసేన ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప తెలిపారు. ఆదివారం ఆలూరులోని వీరభద్ర గౌడ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రూపు రాజకీయాలు వీడి 2024 ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా టిడిపి, జనసేన కలిసి పని చేయాలని తెలిపారు. 2024లో ప్రభుత్వం ఏర్పాటు చేసి, రాష్ట్రాభివృద్ధికి, నియోజకవర్గ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేస్తామని చెప్పారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే వేదవతి, నగరడోన ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, ఆలూరు నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని తెలిపారు. నియోజకవర్గం చాలా వెనుకబడిన ప్రాంతమని, అభివృద్ధి చెందాలంటే కొత్త ఆలోచనలు, పెద్దల అనుభవాలను తీసుకుని ముందుకెళ్తామని చెప్పారు. రోడ్లు, డ్రెయినేజీ పరిస్థితి దారుణంగా ఉందన్నారు. అంతకు ముందు టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ వర్గీయులతో జనసేన నాయకులు, కార్యకర్తలు ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయ ఆవరణలో ఉన్న జాతీయ రహదారి గుంతలమయంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని నిరసన చేపట్టారు.

గుంతల రోడ్లు కనిపించడం లేదా జగన్ రెడ్డి

- తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

నిరసన చేపడుతున్న నాయకులు

రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న రోడ్లు కనిపించడం లేదా అని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్‌రెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించారు. ఆదివారం మండలంలోని మురవణి క్రాస్ నాలుగో మైలు దగ్గర అధ్వానంగా ఉన్న రోడ్లపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి చేయలేని వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని కోరారు. మంత్రాలయం నియోజకవర్గంలో మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఏం చేశారని నిలదీశారు.

కర్నూలులో జాతీయ కౌన్సిల్ సమావేశాలు

- రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

డిసెంబర్ 15, 16, 17న కర్నూలులో అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని కెవిపిఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రైతుసంఘం జిల్లా నాయకులు హనుమంతు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని, వలసల నివారణకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను అంచనా వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిందని విమర్శించారు. కరువుతో రైతులు, వ్యవసాయ కార్మికులు దిక్కు తోచని స్థితిలో ఉంటే కరువు సహాయక చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. వలసల నివారణకు కోసం ఉపాధి హామీ పనులు పెట్టాలని, కరువు ప్రాంతాల్లో తెల్ల కార్డులు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికీ చౌక డిపోల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతులకు తీవ్ర ద్రోహం చేసిందని తెలిపారు. మద్దతు ధరల చట్టం తీసుకొస్తానని హామీ ఇచ్చి రైతులను మోసం చేసిందని, రసాయనిక ఎరువుల ధరలు పెంచిందని తెలిపారు. మద్దతు ధరల చట్టం, రైతుల రుణాల మాఫీ కోసం, కరువు సహాయక చర్యల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రైతులు సమైక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ బాబు, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గురుశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, సిఐటియు పట్టణ కార్యదర్శి రాముడు, ప్రజాసంఘాల నాయకులు లక్ష్మీనరసయ్య, అబ్దుల్లా, ఎల్లప్ప, జయరాజు, ఆంథోని, రాజు, వీరేంద్ర పాల్గొన్నారు.

ఆదోనిరూరల్ : డిసెంబర్ 15, 16, 17న కర్నూలులో జరిగే అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ కోరారు. మండలంలోని పాండవగల్లు గ్రామం పాతూరు ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర మండల ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కర్నూలు జిల్లా నిత్యం కరువు, కాటకాలతో అల్లాడుతుంటే అరకొర కరువు మండలాలను ప్రకటించి ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటున్నాయని విమర్శించారు. పంటలు పూర్తిగా దెబ్బతిని తీవ్రంగా నష్టపోయినా ఆదోని మండలాన్ని పాక్షిక కరువుగా ప్రకటించడం అన్యాయమని తెలిపారు. తక్షణమే తీవ్ర కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. కరువు సహాయక చర్యల్లో భాగంగా ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రామాల్లో పనుల్లేక వేలాదిమంది తెలంగాణ, కర్ణాటక ప్రాంతాలకు వలస వెళ్లారని తెలిపారు. గ్రామాల్లో తక్షణమే 200 రోజుల ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. మేళిగనూరు వద్ద వరద కాలువ నిర్మించి ఆదోని మండలానికి సాగునీరు ఇవ్వాలని కోరారు. జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా డిసెంబర్ 15న వేలాది మందితో బహిరంగ సభ ఉంటుందని, సభకు పెద్ద ఎత్తున రైతులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, అయ్యప్ప, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.రామాంజనేయులు, బి.వీరారెడ్డి, కెవిపిఎస్ మండల అధ్యక్షులు మునిస్వామి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

ఆదోనిలో మాట్లాడుతున్న వెంకటేశులు

బైక్, లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆదోని

ద్విచక్ర వాహనం, లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదోని పట్టణం ఆలూరు రోడ్డు గోశాల వద్ద ఆదివారం చోటు చేసుకుంది. బంధువులు వివరాల మేరకు... ద్విచక్ర వాహనం, లారీ ఢీకొన్న ప్రమాదంలో పట్టణంలోని దివాకర్ నగర్‌కు చెందిన నీలకంఠ అనే వ్యక్తి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. పట్టణంలో పంజరపోల్ మలుపు ప్రమాదంగా ఉందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నేషనల్ హైవే అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ మలుపు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్ సేఫ్టీ నిర్మించాలని ఇక్కడ నివసిస్తున్న ప్రజలు కోరుతున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న వన్ టౌన్ సిఐ విక్రమ్ సింహ మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

మృతుని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

‘అధికారులపై అవినీతి ఆరోపణలు అవాస్తవం’

ప్రజాశక్తి - హాలహర్వి

ఎల్ఎల్‌సి అధికారులపై అవినీతి ఆరోపణలు చేయడం అవాస్తవమని గ్రామ రైతులు నారాయణరెడ్డి, రామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఎల్ఎల్‌సి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. పచ్చరపల్లి గ్రామంలో అన్నదమ్ముల వ్యక్తిగత సమస్యలుంటే అధికారులపై నిందలు మోపడం అవాస్తవమని తెలిపారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు గ్రామంలో జరిగిన విషయాలను గమనించి వాస్తవాలు మాట్లాడాలని చెప్పారు. అధికారులపై నిందలు మోపడం, ఆరోపణలు చేయడం తగదని తెలిపారు. అన్నదమ్ములు పొలం విషయంలో ఒకరికొకరు పడకపోవడం ఈ సమస్యకు కారణమైందని చెప్పారు. చిన్నపాటి సమస్యలుంటే పరిష్కరించడానికి అధికారులు ఉన్నారని తెలిపారు. అనంతరం ఎల్ఎల్‌సి అధికారి మాట్లాడారు. అధికారులపై నిందలు వేయడం సరికాదని తెలిపారు. సమస్యలుంటే రైతులు కలిసికట్టుగా పరిష్కరించుకోవాలని చెప్పారు. రైతులు ప్రహ్లాద రెడ్డి, హనుమంతు రెడ్డి, పార్థ, బజారప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే కరువు మండలాలు

- మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆర్.పురుషోత్తం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి చొరవతోనే ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించిందని మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆర్.పురుషోత్తం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఖరీఫ్ 2023లో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కరువు మండలాలను ప్రకటించారని తెలిపారు. త్వరగా కార్యరూపం దాల్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వై.బాలానాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గత నెలలో ముఖ్యమంత్రి ఎమ్మిగనూరు పర్యటనలో ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి నియోజకవర్గంలోని కరువు పరిస్థితుల గురించి వివరించారని చెప్పారు. నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేలా చూడాలని, విమర్శలకు తావు లేకుండా జాబితాను సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని కోరారు. రైతుల బ్యాంకు వివరాలు సేకరించడంలో వాలంటీర్లు పూర్తి సహకారం అందించాలని, నష్టపోయిన రైతులు రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

అట్టేకల్లు అభివృద్ధికి ఆటంకాలు

- రెండేళ్లుగా మార్కెట్ ఏర్పాటుకు సహకారం కరువు - అధికార పార్టీకి అధికారుల వత్తాసు

ప్రజాశక్తి - ఆస్పరి

గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిన అధికారులు అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తున్న పరిస్థితులు అట్టేకల్లు గ్రామ పంచాయతీలో నెలకొన్నాయి. అధికారులు అధికార పార్టీ నాయకుల మాటలకు తలొగ్గి అభివృద్ధిని విస్మరించడం దారుణం. బిల్లేకల్లు పంచాయతీ నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడిన అట్టేకల్లు పంచాయతీ అభివృద్ధికి అధికారుల నుంచి సహకారం కొరవడింది. పంచాయతీ పరిధిలో కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని రెండేళ్లుగా అధికారులను కోరుతున్నా స్పందించడం లేదు. సర్పంచి లతాశ్రీ రెండేళ్ల క్రితం జిల్లా పంచాయతీ అధికారిని కలిసి కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఎండార్స్ చేస్తూ డిఎల్‌పిఒకు పంపగా ఆయన పట్టించుకోవడం లేదు. బిల్లేకల్లు గ్రామానికి చెందిన వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య మార్కెట్ ఏర్పాటుకు అడ్డు పడడంతో ముందుకు సాగడం లేదు.

వైసిపి నాయకుని మాటకు తలొగ్గిన డిఎల్‌పిఒ అనుమతి మంజూరులో నిర్లక్ష్యం చేస్తున్నారు. అట్టేకల్లులో మార్కెట్ ఏర్పాటు చేస్తే కొంత దూరంలో ఉన్న బిల్లేకల్లు మార్కెట్‌పై ప్రభావం ఉంటుందని అనుమతికి నిరాకరిస్తున్నారు. ఆయన కుమారుడే సర్పంచి కావడంతో వారి మాటే ఇక్కడ చెలామణి అవుతుంది. కొత్తగా ఏర్పడిన అట్టేకల్లు పంచాయతీకి మార్కెట్ ఆదాయం కలిసి వస్తే అభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. పంచాయతీకి నిధులు రాకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో చిన్న, చిన్న అభివృద్ధి పనులు కూడా జరగడం లేదు.

మార్కెట్ ఏర్పాటుకు అడుగుతున్నా పట్టించుకోవడం లేదు

- లతాశ్రీ, అట్టే కల్లు సర్పంచి

గ్రామంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని రెండేళ్లు అధికారులను అడుగుతున్నా పట్టించుకోవడం లేదు. తాము ప్రతిపక్ష పార్టీ సర్పంచి కావడంతో అధికార పార్టీ నాయకుల మాటకు విలువనిస్తూ అధికారులు ఏ పని చేయడం లేదు. పంచాయతీకి నిధులు లేకపోవడం వల్ల చిన్న పనిని కూడా చేసుకోలేక పోతున్నాం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కూరగాయల మార్కెట్‌కు అనుమతి ఇవ్వాలి.

IN THE COURT OF THE II ADDL.
DISTRICT JUDGE KURNOOL AT ADONI
A.S.No.51/2018

K. Ramudu. ...Appellant
Vs
K.T. Akshita & 3 others. ...Respondents

NOTICE TO THE RESPONDENT

To
R.4.
Dasthagiri S/o Imam Sab, R/o Ward No.9, Siddappa Palyam, Kosigi village & Mandal Kurnool Dist.

Whereas the above named appellant filed above appeal as against the decree and judgment in OS No.124/2011 of Prl. Junior civil judge's court Adoni. Hence you are hereby required to appear before this court On **4th day of December, 2023 at 10.30 AM** in person or through an advocate and answer the said appeal, otherwise the matter will be decided exparte.

By Court Order
Sri.D. Mallikarjuna,
B.Com B.L.,
Advocate,
D.No.1/1930,
Gandhi Nagar,
Yemmiganur 518 360, Kurnool Dist.

రోడ్డుపై బైఠాయించిన జనసేన నాయకులు

గుంతలమయంగా ఆదోని రోడ్లు

- జనసేన నాయకుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో రోడ్లు గుంతలమయమై అధ్వానంగా మారాయని జనసేన మండల నాయకులు పులి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆదోనిలోని కొత్త బ్రిడ్జి మేదర్ గేరి నుంచి ఆర్‌టిఒ కార్యాలయం రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కడ గుంత కనిపిస్తే అక్కడ ధర్నాకు దిగుతామన్నారు. నాలుగున్నర ఏళ్లలో చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. జనసేన, టిడిపి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రోడ్ల రూపురేఖలు మారుస్తామన్నారు. జనసేన నాయకులు ప్రకాష్, శ్యామ్, శాంత, అజయ్, మహేంద్ర, మల్లికార్జున పాల్గొన్నారు.

‘కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి’

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని 29వ వార్డులో పారిశుధ్య కార్మికురాలు, దళిత మహిళను కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జై భీమ్ యూత్ సభ్యులు కుమార్, భవాని శంకర్ కోరారు. ఆదివారం ఆదోనిలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెల్లవారుజామున వీధులను శుభ్రం చేసే దళిత మహిళ పట్ల అసభ్య పదజాలం వాడి దురుసుగా ప్రవర్తించి దౌర్జన్యం చేయడం సమంజసం కాదన్నారు. ఈ అవమానాన్ని దళిత మహిళ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి, శానిటేషన్ కార్మికులకు చెప్పారని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నోటీసులు జారీ చేయాలని కోరారు. జై భీమ్ యూత్ సభ్యులు ఎం.సురేష్ బాబు, బండారి మారన్న, జి.నాగరాజు, విష్ణు పాల్గొన్నారు.

వినతి పత్రం ఇస్తున్న సభ్యులు

విఆర్ఎ కుటుంబాన్ని ఆదుకుంటాం

- తహశీల్దార్ వెంకటేష్ నాయక్

ప్రజాశక్తి - దేవనకొండ

అనారోగ్యంతో మృతి చెందిన గుడిమిరాళ్ల విఆర్ఎ సుంకన్న (74) కుటుంబాన్ని ఆదుకుంటామని తహశీల్దార్ వెంకటేష్ నాయక్ తెలిపారు. సుంకన్న మృతి పట్ల తహశీల్దార్ వెంకటేష్ నాయక్ ఆదివారం సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 40 ఏళ్లకు పైగా గ్రామంలో రైతులు, గ్రామస్తులతో సఖ్యతగా ఉంటూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు సంక్షేమ, సమాచారాలను ఎప్పటికప్పుడు చేరవేస్తూ ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. అనారోగ్యంతో మృతి చెందిన సుంకన్న కుటుంబంలో ప్రభుత్వ నిబంధనల మేరకు విఆర్ఎగా అర్హులైన వారికి విఆర్ఎ ఉద్యోగంతో పాటు ప్రభుత్వం ద్వారా వచ్చే బెనిఫిట్స్‌ను త్వరలోనే అందేలా చూస్తామన్నారు. దహన సంస్కారాలకు రూ.15 వేలను విఆర్ఒ ఆనంద్ కుమార్ అందించారు. డిప్యూటీ తహశీల్దార్ సుదర్శన్, సీనియర్ సహాయ కులు వెంకటేష్, విఆర్‌ఒల సంఘం మండల అధ్యక్షులు దాదావలీ, మునీర్, చంద్ర, షేకన్న, హరికృష్ణ, సుంకన్న, రాజన్న, కౌలుట్ల, సుమన, మధునావతి, రామేశ్వరి, సలోమి, సూరి, జాకీర్, విఆర్ఎల సంఘం మండల అధ్యక్షులు రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న విఆర్ఒ ఆనంద్

విలేకరులకు ఇంటి స్థలాలివ్వాలి : జాప్

ప్రజాశక్తి -పెద్దకడబూరు

విలేకరులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, లేకపోతే తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) మండల అధ్యక్షులు రంగముని హెచ్చరించారు. ఆదివారం స్థానిక జాప్ యూనియన్ కార్యాలయంలో కేక్ కట్ చేసి 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జాప్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి, సూర్యోదయం విలేకరి బజారి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, సునీల్, రామకృష్ణ, రాజు, గుడిసె శివరాజ్, రిషి, నరసింహ, సుశీంద్ర, భీమా, ఆశీర్వాదం, రాజేష్ పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి గాలికి

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రాభివృద్ధిని, సంక్షేమాన్ని వైసిపి ప్రభుత్వం గాలికొదిలేసిందని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ విమర్శించారు. ఆదివారం ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌టిసి డిపో ప్రాంతంలో టిడిపి నాయకులు వీరేష్ అధ్యక్షతన ‘బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ’ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సరికొత్త పథకం ‘జగనన్న దోపిడీ గ్యారెంటీ స్కీమ్’ అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు ఒక గ్యారెంటీని అందించే నాయకులు చంద్రబాబు నాయుడు అని, రాష్ట్ర సంపద దోపిడీకి గ్యారెంటీనిచ్చే పెత్తందారు జగన్ రెడ్డి అని విమర్శించారు. ‘జగనన్న దోపిడీ గ్యారెంటీ’ పథకంలో తనకు నచ్చిన కాంట్రాక్ట్ సంస్థలు, వ్యక్తులకు ప్రజల సొమ్ము దోచిపెట్టడానికి వీలుగా ముఖ్యమంత్రి గ్యారెంటీ లెటర్స్ ఇస్తున్నారని తెలిపారు. మెగా ఇంజినీరింగ్ సంస్థకు జగన్ సర్కార్ ఇప్పటికే రూ.255 కోట్ల చెల్లింపులకు సంబంధించి 7 గ్యారెంటీ లెటర్స్ మంజూరు చేసిందన్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో చెల్లింపులు చేస్తామని చెబుతూ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీ లెటర్స్ తీసుకొని కాంట్రాక్ట్ సంస్థలు రుణాల కోసం బ్యాంకులను ఆశ్రయిస్తున్నాయని తెలిపారు. 2024 బడ్జెట్ ప్రవేశపెట్టకుండా శాఖల వారీగా కేటాయింపులు జరగకుండా ఫైనాన్షియల్ నిబంధనలు, బిజినెస్ రూల్స్‌కు విరుద్ధంగా ఇలా ఎలా గ్యారెంటీ లెటర్స్ ఇస్తున్నారో పిట్టకథల మంత్రి బుగ్గన చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్న ఆస్పత్రులకు రూ.1000 కోట్లకు పైగా బకాయి పడగా, నవంబర్ 27 నుంచి వైద్యసేవలు నిలిపివేస్తామని ఆస్పత్రులు చెప్పినా జగన్ రెడ్డిలో చలనం లేదని విమర్శించారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో వివిధ ప్రాజెక్ట్ పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.30 వేల కోట్లు చెల్లించాలని తెలిపారు. పనులు నిలిపేసినా స్పందించని ముఖ్యమంత్రి, నేడు అయినవాళ్లకు మాత్రం ఆఘమేఘాల మీద గ్యారెంటీ లెటర్స్ జారీ చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు సరఫరా చేస్తున్న గుత్తేదారులకు కూడా రూ.వందల కోట్లు బకాయిపెట్టి, నేడు నీటి సరఫరా ఆగిపోయే దుస్థితి కల్పించారని చెప్పారు. చంద్రబాబు కృషితో రాష్ట్రానికి వచ్చిన ఐఐబి, ఎన్‌డిబి రుణాలతో ప్రారంభమైన రోడ్ల ప్రాజెక్టులకు కూడా చెల్లింపులు చేయకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయని తెలిపారు. రాష్ట్రంలోని రోడ్లు గుంతలమయమయ్యాయని చెప్పారు. టిడిపి మండల నాయకులు మురళీ, పట్టణ ముస్లిం, మైనారిటీ నాయకులు సాధిక్ వలీ, గిరిధర్, బాబురావు, నాగేంద్ర, రాఘవరెడ్డి, రవి భారత్, బోయ ఈరన్న, పరమేష్, రాజు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న గుడిసె ఆది కృష్ణమ్మ

IN THE COURT OF THE II ADDL.
DISTRICT JUDGE KURNOOL AT ADONI
I.A.No.203/2023 in O.S. No.6/2023

Y. Rajesh. ...Petitioner
Vs
Karanam Aruna Jyothi. ...Respondent
To

NOTICE TO THE RESPONDENT

Karanam Aruna Jyothi W/o Pasupuleti Varaswamy, H.No.1/146, Rayachoti Subbaiah colony, Adoni town, Presently residing at H.No.1/140/17, Sree Sai Nilayam, Rajiv Gandhi Nagar, Near B.C Hostel, Adoni 518 301. Kurnool Dist.

Whereas the above named petitioners filed the above petition under Order 39 Rule 1 & 2 of CPC for grant of Ad Interim injunction restraining you from alienating the petition schedule property till the disposal of the suit. Hence you are hereby required to appear before this court **On 6th day of December, 2023 at 10.30 AM** in person or through an advocate and answer the said petition, otherwise the matter will be decided exparte.

By Court Order
Sri.D. Mallikarjuna,
B.Com B.L.,
Advocate,
D.No.1/1930, Gandhi Nagar,
Yemmiganur 518 360 ,
Kurnool Dist.

పోరాటాల ద్వారానే హక్కుల సాధన

- ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు

ప్రజాశక్తి - దేవనకొండ

పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు కోరారు. ఆదివారం స్థానిక ముగితాత కమ్యూనిటీ హాలులో జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. మ్యాన్ డేస్ టార్గెట్ విధానాన్ని రద్దు చేసి సీనియర్ మేటీ, ఫీల్డ్ అసిస్టెంట్లు అనే తారతమ్యం లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్లుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అర్హత, అనుభవం కలిగిన వారికి ప్రమోషన్ కల్పించి మున్సిపాలిటీ పరిధిలోకి విలీనమైన పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు క్యాన్సిలేస్ హెల్త్ కార్డు సౌకర్యం కల్పించి, ప్రమాదవశాత్తు మరణించిన వారికి ఎక్స్‌గేషియా రూ.10 లక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు, వ్యకాస ఆధ్వర్యంలో ఉద్యమిద్దామని, తమ వంతు సహకారం ఉంటుందని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలను సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఐకమత్యంగా ఉద్యమించినప్పుడే సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎమ్‌డి.అంజిబాబు, అధ్యక్షులుగా పెద్ద రాజు నాయక్, ప్రధాన కార్యదర్శిగా వీరేష్ గౌడ్, కోశాధికారిగా వీరేష్, ఉపాధ్యక్షులుగా బాల రంగస్వామి, ఈరమ్మ, గిడ్డయ్య, మధు, ఈరన్న, సహాయ కార్యదర్శులుగా ఆనంద్, నరసన్న, భీమన్న, లోకా రెడ్డి, మల్లప్ప, సుదర్శన్, పెద్దయ్యను ఎన్నుకున్నారు. నంద్యాల జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హరి ప్రసాద్, దేవదాస్, ఉపాధ్యక్షులు నాగన్న, నాయకులు రామానాయుడు, గిడ్డయ్య, మధు, వెంకట్ రాములు పాల్గొన్నారు.

IN THE COURT OF THE II ADDL.
DISTRICT JUDGE KURNOOL AT ADONI
O.S. No.6/2023

Y. Rajesh. ...Plaintiff
Vs
Karanam Aruna Jyothi. ...Defendant
To

SUIT SUMMONS TO THE DEFENDANT

Karanam Aruna Jyothi W/o Pasupuleti Varaswamy, H.No.1/146, Rayachoti Subbaiah colony, Adoni town, Presently residing at H.No.1/140/17, Sree Sai Nilayam, Rajiv Gandhi Nagar, Near B.C Hostel, Adoni 518 301. Kurnool Dist.

Whereas the plaintiff has instituted a suit against you for specific performance basing on the agreement of sale. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions, On **6th day of December, 2023 at 10.30 AM** in the fore noon to answer the claim and as day fixed for your appearance is appointed for the final disposal of the suit, you must be prepared to produce on that day all the witnesses upon whose evidence and all the documents upon which intend to rely in support of your defence. Take notice that, in default of your appearance on that day before mentioned, the suit will be hear and determined in your absence.

By Court Order
Sri.D. Mallikarjuna,
B.Com B.L.,
Advocate,
D.No.1/1930,
Gandhi Nagar,
Yemmiganur 518 360, Kurnool Dist.

కవులను సత్కరిస్తున్న ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి శ్రీధర్

మహాధర్నాను జయప్రదం చేయండి

- ఏపి రైతు సంఘం

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఈ నెల 27, 28వ తేదీలలో విజయవాడ నగరంలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.సుబ్బరాయుడు, మండల కార్యదర్శి రామ్మోహన్ కోరారు. ఆదివారం బేతంచెర్లలోనిప్రజాసంఘాల కార్యాలయంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు సీతారామపురం జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన రైతు సంఘం మండల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలన్నింటికీ సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి ఎంఎస్‌పిలను నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని, రైతులు, పేదల పాలిట ఉరితాడు కాగల ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించరాదని తెలిపారు. కౌలు రైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలన్నారు. రైతు పంట రుణాల బకాయిలను ఒక పర్యాయం రద్దు చేయాలని చెప్పారు. రైతు రుణ ఉపశమన చట్టంను పార్లమెంటులో ఆమోదించి చేసి రైతుల ఆత్మహత్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ అనుకూల ప్రధాన మంత్రి పంటల బీమా పథకాన్ని ఉపసంహరణ, ధరల పెరుగుదలను నియంత్రించి ఆహారం, మందులు, వ్యవసాయ ఉపకరణాలు, నిత్యావసరాలపై జీఎస్టీని తగ్గించాలన్నారు. పెట్రోలియం ఉత్పత్తులు, వంట గ్యాస్‌పై సెంట్రల్ ఎక్స్ఛేంజ్ డ్యూటీ తగ్గించాలన్నారు. బేతంచెర్ల మండలంలోని గూటుపల్లె చెరువును హంద్రీనీవా నీటితో నింపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రంగాపురం కిష్టన్న, చాకలి ఎల్లాకృష్ణ, పుల్లెం అనిల్, మా బాష, భీమలింగడు, వి.వీరేష్, వెంకట సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

మహిళా సాధికారతతోనే సమన్యాయం

- సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి - నంద్యాల

మహిళా సాధికారతతోనే సమాజంలో సమన్యాయం జరుగుతుందని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. నంద్యాలలో శ్రీ పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో ఆదివారం 56వ గ్రంథాలయ వారోత్సవాలలో మహిళా ఔన్నత్యంపై కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ పాఠకులు, కవులు మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఝాన్సీ లక్ష్మీబాయి, ఇందిరా గాంధీ, తెలుగు కవుల చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఇంచార్జ్ గ్రంథాలయాధికారి అర్ఇ.శ్రీధర్ అధ్యక్షతన దిశా చట్టం మహిళా సాధికారిత చర్చ అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి మాట్లాడారు. మహిళా రక్షణ చట్టాలు పటిష్టంగా అమలు చేసి మహిళలకు భరోసా కల్పించి సమాజాన్ని ముందుకు నడిపించాలని కోరారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో ప్రముఖ కవయిత్రి అసిస్టెంట్ ఇంజనీర్ రత్నలక్ష్మి అతివలలో నిబిడీకృతమైన అపార శక్తి సామర్థ్యాల ఆవిష్కరణ దిశగా ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రచయిత కొప్పుల ప్రసాద్ మాట్లాడుతూ నేటి మహిళలు ఆకాశాన్ని తాకినా ఇంకా వివక్షకు గురి అవుతున్నారని చెప్పారు. అన్నెం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషా సంస్కృతి వికాసానికి గ్రంథాలయాలు దోహద పడతాయని, పాఠకులు ఉపయోగించుకోవాలన్నారు. కవులు నీలకంఠమాచారి, రఫీ, మాబూబాషా తదితరులు కవితలు చదివి వినిపించారు. ఇంచార్జ్ గ్రంథాలయాధికారి శ్రీధర్ అతిథులను, కవులను ఘనంగా సత్కరించారు. నంద్యాల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు, సాహిత్య అభిమానులకు, పరిశోధకులకు అవసరమైన **మిగతా 6వ పేజీలో...**

గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కృషి

- రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్ రావు
- సిరివెళ్లలో ఎస్‌టిలతో సమావేశం
- పలు సమస్యలు విన్నవించిన గిరిజనులు

మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్ రావు

ప్రజాశక్తి - రుద్రవరం

గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్ రావు తెలిపారు. ఆదివారం నంద్యాల జిల్లాలో రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ విస్తృతంగా పర్యటించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం శిరివెళ్ల మండలం మహదేవపురం గ్రామంలోని ఎస్‌టి కాలనీని ఆయన సందర్శించారు. కాలనీలో వెదురు బుట్టల అల్లకందారులతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. ముడి సరుకైన వెదురు లభ్యతలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు పిల్లల విద్య విషయమై ప్రశ్నించి విద్య వలన కలిగే ఉపయోగాలు తెలిపి పాఠశాలలకు తప్పనిసరిగా పంపాలని ఆయన సూచించారు. అనంతరం స్థానిక పురపాలక సంఘ పాఠశాలలో రాష్ట్ర ఎరుకల సంఘం నాయకులు, బంజారా నాయకులు, ఉద్యోగ సంఘాలు పెద్ద ఎత్తున నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ డివిజి శంకర్రావు పాల్గొన్నారు. స్థానిక సమస్యలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, అటవీ భూమి మంజూరు వంటి పలు సమస్యలను నాయకులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరుతూ వినతులు అందజేశారు. అనంతరం కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ మాట్లాడుతూ గిరిజనులు విద్య వలనే ఉన్నత స్థాయికి చేరగలన్నారు. అనంతరం చైర్మన్ డివిజి శంకర్ రావును స్థానికులు, వివిధ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం డివిజి శంకర్ రావు మాట్లాడుతూ ఉదయం నుంచి వచ్చిన వినతులను పరిశీలించామని చెప్పారు. ముఖ్యంగా వెదురు బుట్టల అల్లకం దారుల సమస్యపై సత్వర చర్యలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత కాలమాన పరిస్థితులలో ఈ వృత్తి లాభదాయకరమైనదిగా లేకపోవడం వలన ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం నుండి భూములు ఇప్పించడం లేదా ముడి సరుకు సబ్సిడీపై ఇప్పించే ప్రయత్నం చేస్తామన్నారు. గిరిజనులు పేరుకు భూమిపుత్రులు అయినా భూమి లేని వారిగా ఉండటం కమిషన్ గమనించిందని, అందుకే గిరిజనుల హక్కులు, సంక్షేమం, సాధికారిత కోసం సంఘాలకు అతీతంగా ఏకీకృతంగా కృషి చేయాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కమిషన్‌కు ఏ విధంగా అయినా సమస్యలు తెలుపుకోవచ్చని సంఘ సభ్యులకు, గిరిజనులకు సూచించారు. కోర్ కమిటీ ఏపి వైఎస్ఎస్ మెంబర్ కె.సుబ్బరాయుడు ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఏపి వైఎస్ఎస్ సంఘం నాయకులు పాలకుర్తి శ్రీనివాసరావు, కుమార్, జైలీలా శంకర్, బంజారా హక్కుల సంఘ నాయకుల శ్రీనివాస నాయక్, బి.శంకర్ నాయక్, నాయకులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌ను కలిసిన జిల్లా ఎస్‌పి

నంద్యాల కలెక్టరేట్ : ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్ రావు నంద్యాల జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి ఎస్‌పి

స్లూయిస్ గేటు టాంపర్‌కు యత్నం

- పైకెత్తి కిందికి దించిన గుర్తుతెలియని వ్యక్తులు
- దెబ్బతిని పూర్తిగా కిందికి పడిన గేటు
- పునరుద్ధరణ పనులు చేపట్టిన గంగ అధికారులు

ప్రజాశక్తి - రుద్రవరం

తెలుగు గంగ ప్రధాన కాలువ నుండి 19వ బ్లాక్ ఛానల్‌కు సాగునీటిని విడుదల చేసే స్లూయిస్ గేటును గుర్తు తెలియని వ్యక్తులు పైకి ఎత్తి కిందికి దిగకుండా టాంపర్ చేసే ప్రయత్నం వికటించి గేటు పూర్తిగా కిందికి దిగిపోయింది. ఈ సంఘటనను గమనించిన గంగ అధికారులు స్లూయిస్ గేటు పునరుద్ధరణ పనులు చేపట్టారు. వివరాలు.. రుద్రవరం మండల పరిధిలోని తెలుగు గంగ ప్రధాన కాలువ నుండి 19వ బ్లాక్ ఛానల్ ద్వారా రైతులకు సాగునీరు ప్రవహిస్తోంది. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున నీరు అధిక శాతంలో బ్లాక్ ఛానల్‌కు విడుదల చేయాలనే ఉద్దేశంతోనో లేక మరే కారణం చేతనో గానీ బ్లాక్ ఛానల్ స్లూయిస్ గేటును ఎత్తి తిరిగి గేటు కిందికి దిగకుండా టాంపర్ చేసే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నం వికటించి గేటు పూర్తిగా కిందికి దిగిపోయింది. విషయం తెలుసుకున్న గంగ అధికారులు స్లూయిస్ గేటును పరిశీలించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గంగ ఏఈ రవీంద్రనాథ్ మాట్లాడుతూ కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పాల్పడిన సంఘటన కారణంగా బ్లాక్ ఛానల్ స్లూయిస్ గేటు పూర్తిగా కిందికి దిగిపోయిందన్నారు. వెంటనే సిబ్బందితో వచ్చి గేటు పునరుద్ధరణ చేపట్టామన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు చివరి విడత సాగునీరు అందిస్తున్న కీలక సమయంలో ఇలాంటి సంఘటనలకు పాల్పడడం సరైనది కాదన్నారు. ఇటువంటి సంఘటనలతో పంటలకు సాగునీరు అందక రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొనే అవకాశం ఉందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆకతాయిలు ఇలాంటి పనులు చేయవద్దని కోరారు. మళ్లీ ఇలాంటి సంఘటనలకు పాల్పడితే కేసులు పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దెబ్బతిన్న 19వ బ్లాక్ ఛానల్ స్లూయిస్ గేటు

పునరుద్ధరణ పనులు చేపడుతున్న అధికారులు

గురువులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని వైపిపిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984-85వ సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 39 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సందర్భంగా పాఠశాల జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శంకర్ రెడ్డి, రాజారెడ్డిలను శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఒక బీరువా, డిగ్రీ కళాశాలకు ఒక బీరువాను బహుకరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ గంగన్న, పూర్వ విద్యార్థులు ప్రముఖ శిల్పి దురుగడ్డ రవీంద్ర చారి, హరి ప్రసాద్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ప్రసాద్, లెక్చరర్ బషీర్, రఫీ, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

చందలూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని చందలూరు గ్రామంలో డాక్టర్ సంజీవ్, డాక్టర్ శ్యామల అధ్వర్యంలో మహి కిషోర్ ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్య శిబిరంలో ఎముకల పరీక్ష, రక్త పోటు పరీక్ష, మధుమేహ పరీక్షలు చేశారు. మధుమేహం వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళలకు ప్రత్యేకంగా డాక్టర్ శ్యామల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఆరోగ్యంపై ప్రత్యేక సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మహి కిషోర్ ఫౌండేషన్ చైర్మన్ సోమవరపు మహేశ్వరమ్మ, ట్రస్టీ వైష్ణవ్, వైభవ్ కిషోర్, పిడి శ్రీకాంత్, పవన్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పనిచేసే వారికే పట్టం కట్టండి : మాజీ మంత్రి

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రంలో ప్రజలు, రైతులు, మహిళలు, యువత కోసం నిత్యం కృషి చేసే వారికే పట్టం కట్టాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ కోరారు. మండలంలోని డి కొత్తపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న మాజీ మంత్రికి స్థానిక టిడిపి నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రిటిష్ పాలన నడుస్తుంద న్నారు. రాష్ట్రంలో హిట్లర్ పాలన నడుస్తోందని ఆమె విమర్శించారు. ఎన్నడు లేని విధంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కనీసం సాగునీటి వనరులు రైతులకు సమకూర్చలేని దుస్థితికి చేరుకుందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, జలవనరుల సలహాదారుడు, ఎంపి ఉండి కూడా తెలుగంగ, కేసికెనాలుకు నీళ్లు తెప్పించలేని దౌర్భాగ్య స్థితిలో ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉండి రైతులతో కలిసి కలెక్టర్‌ను కలిసి కేసికి నీరు తెప్పించిన ఘనత తెలుగుదేశందేనని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్ బాషా, మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి,టిడిపి నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, కొలిమి మా బు షరీఫ్, ముల్లా షాబుల్, ముల్ల గఫార్, నూర్ భాషా అబ్దుల్లా, జిలేబి షరీఫ్ ,హనీఫ్ ,ఖలీల్,అష్రాఫ్, సల్లా నాగరాజు,పెద్ద ఈశ్వర రెడ్డి,గోపాల్,గంగన్న,సురేష్ కుమార్ రెడ్డి,పుల్లారెడ్డి, సంజీవరెడ్డి, పెద్దసుబ్బారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె : దుల్హన్ పథకాన్ని గాలికి వదిలేసిన సైతాన్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి విమర్శించారు. మండలంలోని హుసేనాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024లో టిడిపి, జనసేన పార్టీలు కలిసి సైకో పాలనకు అంతం పలికి, ప్రజాప్రభుత్వాన్ని స్థాపించడం ఖాయమన్నారు. హుస్సేనాపురం గ్రామ పంచాయతీలో 2014 నుంచి 2019 వరకు టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి గురించి లెక్కలతో సహా గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోపాల్ రెడ్డి, జహంగీర్, మొహమ్మద్, దొనపాటి భాస్కర్ రెడ్డి, జనసేన నాయకులు భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : టిడిపితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కౌన్సిలర్ హుస్సేన్ భాష అన్నారు. పట్టణంలోని 143వ బూత్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని కౌన్సిలర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతి పేద కుటుంబానికి అండగా ఉండేందుకు ప్రజాహిత మినీ మేనిఫెస్టోను టిడిపి తెచ్చిందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పాలన్నారు.

చాగలమర్రి : ష్యూరిటీ బాండ్లను అందజేస్తున్న మాజీ మంత్రి

బనగానపల్లె : కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ : ప్రజలకు మేనిఫెస్టో పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రోటరీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాల పట్టణంలోని ఎస్సార్బీసీ కాలనీలో ఉన్న పరివర్తన లైఫ్ సెంటర్లో ఉన్న పిల్లలకు చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని రూ. 10 వేలు విలువ చేసే దుప్పట్లను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు దండే దస్తగిరి మాట్లాడుతూ కీర్తిశేషులు గంటా రాజేష్ కుమార్ రెడ్డి జ్ఞాపకార్థం రిటైర్డ్ టీచర్ జిఎంవి సుబ్బారెడ్డి సహాయ సహకారాలతో దుప్పట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలకు దాతలుగా వ్యవహరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. క్లబ్ కార్యదర్శి సుధ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల సేవా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కాశీ గారి శీను, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిమ్ము నాగన్న, ఎల్.కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్గ నిర్దేశంగా పరిశోధనలు

ప్రజాశక్తి - నంద్యాల : పరిశోధనలు అధ్యాపకులకు ఒక మార్గ నిర్దేశం చేస్తాయని శ్రీ రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ జి.రామకృష్ణ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం అధ్యాపకులకు 'పరిశోధనా పత్రాల ప్రచురణలో మెలుకువలు' అంశంపై 3 రోజుల పాటు ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి, డాక్టర్ కృప శంకర్ గుప్త, కళాశాల ప్రిన్సిపల్ కెబివి సుబ్బయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకష్ణ రెడ్డి , కెఎస్. గుప్త కలిసి ఎంపవర్మెంట్ : కాన్సెప్ట్ అండ్ అప్లికేషన్ (ఆన్ ఇన్వెస్ట్మెంట్ ఫర్ సెల్ఫ్-ట్రాన్స్ఫర్మేషన్) పుస్తకాన్ని విడుదల చేశారు. అలాగే ఝాన్సీ లక్ష్మి బాయ్ జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయిని ఒక ప్రేరణగా తీసుకొని ప్రతి ఒక్క అమ్మాయి ముందుకు వెళ్ళాలన్నారు. విద్యార్థులకు నూతన విద్యా విధానం అవలంభించడానికి పరిశోధనలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

మక్కాయాత్రపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని అరుణోదయ పాఠశాలలో ప్రభుత్వ ప్రధాన ఖాజీ మహమ్మద్ జాఫర్ సాధిక్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు మక్కాయాత్రపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. వచ్చే నెలా రెండవ తేదీన మక్కాయాత్రకు బయలుదేరుతున్న ముస్లిం సోదరులను ఉద్దేశించి ప్రభుత్వ ఖాజీ మాట్లాడారు. ముఖ్యంగా మక్కాయాత్ర ప్రాముఖ్యతను వివరించడంతోపాటు అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మౌలానా ముఫ్తి అబ్దుల్ అజీజ్ ఉమ్రా నియమాలు, ప్రయాణ జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు అమీర్ బాషా పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నేడు ఉదయం 9-30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని అవుకు మెట్ట వద్ద ఉన్న షిర్డి సాయి బాబా ఆలయంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో రజతోత్సవ వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ సుబ్రమణ్యం, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు గాధంశెట్టి వేణుగోపాల్, గుండా బాలాజీ, గుండా రవికుమార్, జక్క నాగరాజు, తిరుపాల్ గౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ మ్యాచ్ కోసం ప్రొజెక్టర్ స్క్రీన్ ఏర్పాటు

- భారత్ గెలవాలని అభిమానులు రక్తదానం

ప్రజాశక్తి - అవుకు : ప్రపంచ క్రికెట్ మ్యాచ్‌లో భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న ఫైనల్ పోరును తిలకించేందుకు అవుకు పట్టణంలోని ఉన్నత పాఠశాల మైదానంలో వైసిపి నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అభిమానుల కోసం ఆదివారం భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. అలాగే భారత్ గెలవాలని అభిమానులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అవుకు మండలంలో ఎక్కడ చూసినా క్రికెట్ అభిమానుల సందడి నెలకొంది. తుది పోరులో భారత్ గెలవాలని అభిమానులు ప్రార్ధనలు, పూజలు నిర్వహించారు. క్రికెట్ మ్యాచ్‌ను తిలకించేందుకు చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ టీవీల ముందు, సెల్ఫోన్లలో నిమగ్నం అయ్యారు. పట్టణంలో ఎక్కడ చూసినా కూడా నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. అభిమానులందరూ టీవీల ముందు ఉండడంతో రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.

రక్తదానం చేస్తున్న క్రికెట్ అభిమానులు

నాయకులకు కండువాలను వేస్తున్న దృశ్యం

ప్రభుత్వం లంబాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఎల్‌హెచ్‌పిఎస్ యువసేన జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయక్

ప్రజాశక్తి - పాములపాడు

ప్రభుత్వం లంబాడికి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎల్‌హెచ్‌పియస్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఆర్ సోమశేఖర్ నాయక్ డిమాండ్ చేశారు. పాములపాడు మండలం ఎర్ర గూడూరు గ్రామానికి చెందిన ఆర్ కైలాస నాయక్ లంబాడి హక్కుల పోరాట సమితి యువసేన జిల్లా అధ్యక్షునిగా ఎంపిక పట్ల ఎర్రగుడూరు గ్రామ లంబాడి హక్కుల సంఘం నాయకులు హరికృష్ణ నాయక్, త్రివేంద్ర నాయక్, దేవర నాయక్, సురేష్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమశేఖర్ నాయకులకు శు భాకాంక్షలు తెలిపారు. సోమశేఖర్ నాయక్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారానికి రాకముందు గిరిజనులకు అనేకంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. ప్రభుత్వం అన్ని విధాల గిరిజనులు ఆదుకోవాలని, తాను పక్షంలో ఆందోళన చేపడతామని అన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గురువులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన 1973-74 బ్యాచ్ విద్యార్థుల స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. కర్నూలు, కడప, అనంతపురం, హైదరాబాదు, బెంగళూరు తదితర ప్రాంతాల్లో స్థిర పడిన 40 మంది పూర్వవిద్యార్థుల పాల్గొన్నారు. 50 సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటయ్య,పూర్వపు ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, బాలమునయ్య,మధుసూధన్ శర్మ లను పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను,వారి కుటుంబ సభ్యులతో కలిపి ఘనంగా సత్కరించి మెమెంటోలను అందజేసారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులు,విద్యార్థుల మతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్దనాగయ్య, రాందాస్‌రెడ్డి, బాలసుబ్బయ్య,సుదర్శన్,డీలర్ గౌస్, రామచంద్రుడు, సుబ్బరాయుడు, బాలసుబ్బయ్య, విజయభాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ, జయరామకష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, శివలీల,కృష్ణవేణి,తదితరులు పాల్గొన్నారు.

అనాధలకు దుప్పట్లు పంపిణీ

దుప్పట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా ఉండే అనాధలకు, వృద్ధులకు, మతిస్థిమితం లేని వారికి, వికలాంగులకు, దివ్యాంగులకు, జువాజి సుంకన్నా సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా జువాజీ సేవా సమితి సభ్యులు శ్రీకాంత్ గౌడ్ మాట్లా డుతూ దాదాపుగా 20 మంది నిరాశ్రయులకు చలికాలం దృష్టిలో ఉంచుకొని దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో సేవాసమితి సభ్యులు దేశెట్టి శ్రీనివాసులు, బజాజ్ రంగస్వామి, రమేష్, భరత్, బాలు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం జూటూరు గ్రామానికి చెందిన ఐదో తరగతి విద్యార్థి విష్ణువర్ధన్ అదృశ్యమైనట్లు తండ్రి నాగార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాములపాడు ఎస్సై జి అశోక్ కేసు నమోదు చేసినట్లు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పాములపాడు మండల కేంద్రంలోని వివేకానంద విద్యా విహార్‌లో చదువుతున్నాడు. శనివారం అందరితోపాటు స్కూలు కు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవ డంతో విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థి విష్ణువర్ధన్ (ఫైల్ ఫోటో)

తల్లిదండ్రులు, బంధువులతో రాస్తారోకో

విష్ణువర్ధన్ తల్లిదండ్రులు బంధువులతో కలిసి విద్యార్థి సంఘాలు పిడిఎస్‌యు తదితర సంఘాలతో పాములపాడు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు కేసు విచారణలో ఉందని దర్యాప్తు చేస్తున్నామని సర్ది చెప్పి ధర్నాను విరమింప చేశారు.

రాస్తారోకో చేస్తున్న విద్యార్థి కుటుంబ సభ్యులు

అధ్వాన స్థితిలో రహదారులు

- పట్టించుకోని ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సంజామల

రహదారులు గుంతలు పడి అధ్వాన స్థితిలో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. జనసేన, టిడిపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం మండలంలో గుంతలమయంగా మారిన ఎగ్గోని-సంజామల-ముదిగేడు గ్రామాల రహదారులను పరిశీలించి గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎగ్గోని-సంజామల - ముదిగేడు రహదారి, ఆర్అండ్‌బి రోడ్డు గుంతలు పడి సంవత్సరాలు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రయాణం తీవ్ర ఇబ్బందిగా మారిందనిఅన్నారు. గుంతలు పడిన రహదారులను సంబంధిత అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రహదారుల మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంజామల టిడిపి నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రుద్రవరం :** గుంతలమయమైన రోడ్లపై ప్రజలకు ప్రయాణం నరకంగా మారిందని జనసేన పార్టీ నాయకుడు ఇరిగెల రాంపుల్లారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రుద్రవరం మండలంలోని మందలూరు గ్రామంలో జనసేన, టిడిపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుద్రవరం మండలం మందలూరు నుండి గాజులపల్లె వెళ్లే రోడ్డు గుంతలు పడడంతో దాదాపు 20 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గుంతలమయమైన ఈ రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో

ఎగ్గుని సంజామల గ్రామాల మధ్యన రోడ్ల దుస్థితిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఇరిగెలా సూర్యనారాయణ రెడ్డి, ఇరిగెల విశ్వనాథ రెడ్డి, ఇరిగెల ప్రతాప్ రెడ్డి, జున్ను ప్రసాద్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, జనసేన సమన్వయకర్త మైలేరి మల్లయ్య, బావికాడి గురప్ప, మహబూబ్ హుస్సేన్, తూపల్లె షేక్ మహబూబ్ బాషా, పెసరవెయ్ చాంద్ భాషా, రామకృష్ణ, మందలూరు రామశేఖర్ రెడ్డి, మిద్దె రామ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉన్నాయని జనసేన నాయకులు నల్లమల రవికుమార్ విమర్శించారు. జనసేన పార్టీ పిలుపు మేరకు రోడ్ల దుస్థితిపై జనసేన- తెలుగుదేశం పార్టీల ఉమ్మడి ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాడు పారుమంచాల నుండి తుడిచెర్ల వెళ్లే రోడ్డు మార్గంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ జనసేన నాయకులు నల్లమల రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రోడ్లపై విమర్శలు చేస్తూ ఉంటే కనీసం స్పందిం చని సిఎం జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రోడ్ల గురించి కళ్ళు తెరవాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రతి పల్లెల్లో సిమెంట్ రోడ్లు వేయించారని,

పారుమంచాల తుడిచెర్ల రోడ్డు మార్గంలో టిడిపి, జనసేన నేతలు

వైసిపి ప్రభుత్వం వచ్చాక కనీసం రోడ్లకు ప్యాచీలు వేయట్లేదని విమర్శించారు. మద్యపాన నిషేధం చేయకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఇబ్బందులు పెడుతు న్నారని, నిత్యవసర సరుకుల ధరలు పెంచి ప్రజలను మరింత ఇబ్బందికి గురి చేశారని, ఇసుక దందాల వల్ల పేద ప్రజలు కనీసం వసతి గృహాలు కట్టించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్తు బిల్లులు పెంచి రాష్ట్రాన్ని ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. జూపాడు బంగ్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దాదాపు పది పల్లెలకు పైగా వెళ్లే ఈ రహదారి పరిస్థితి ఈ రకంగా ఉంటే చిన్న చిన్న గ్రామాల రహదారులు ఏ విధంగా ఉంటాయని విమర్శించారు. రోడ్డు మార్గంలో తిరిగే ప్రతి ఒక్క ప్రయాణికుడికి ఇబ్బందులు కలుగుతున్నాయని, గర్భిణులు మరింత ఇబ్బందు లకు గురవుతున్నారని వాపోయారు. 2024లో జనసేన తెలుగుదేశం కలిసి కట్టుగా పోరాడి అధికారంలోకి తేవాలన్నారు. ఈ కార్యక్ర మానికి జనసేన పార్టీ నుండి మధు బాలరాజు, శ్రీనివాసులు నరేష్, రాజు, తరుణ్, రాజేష్, ప్రదీప్ కుమార్, బాలకష్ణ, శ్రీనివాసులు, నాగన్న, రామాంజనేయులు, బాలఏసు, నాగలింగప్ప, తెలుగు దేశం నుండి కాగుల శంకర్ యాదవ్, వడ్డే శంకర్,చిన్న దస్తగిరి, భూపనపాటి పుల్లయ్య మధురయ్య,మహమ్మద్ హుస్సేన్, చాకలి శ్రీనివాసులు, చాకలి నాగార్జున, వడ్డే విభూదయ్య పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా పేదలకు వరం

బీమా నగదును పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్వేతకుమారి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

డాక్టర్ వైయస్ఆర్ జీవిత బీమా పథకం పేద ప్రజలకు వరం లాంటిదని ఎర్రగుంట్ల సర్పంచ్ కాలూరి శ్వేత కుమారి, వైసిపి సీనియర్ నాయకులు కాలూరి ప్రసాద్ వాల్మీకి సంఘం మండల నాయకుడు బుజ్జి అన్నారు. ఆదివారం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన దూదేకుల బాలవసేని (38) అనారోగ్యంతో మరణించడంతో భార్య దూదేకుల గోకారమ్మకు తక్షణ సహాయం కింద పదివేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి కుటుంబం వైయస్సార్ జీవిత బీమా పథకంలో నమోదు చేసుకోవాలని ఏవైనా ప్రమాదాలు సహజ మరణాలు జరిగే కుటుంబ పెద్దలు మరణిస్తే వారికి చేదోడుగా జీవిత బీమా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ప్యాపిలి

మండలంలోని ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన పెద్ద గుర్రప్ప కుమారుని వివాహ వేడుకల్లో డోన్ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రామసుబ్బయ్య, ప్రిన్సిపాల్ మధు, రామచంద్రుడు రంగస్వామి,నాగన్న, గుర్రప్ప,రామంజి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చింపివేతపై టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని వాల్మీకి నగర్‌లో టిడిపికి చెందిన ఓ నాయకుడి ఫ్లెక్సీ చించివేతపై టిడిపి రాష్ట్ర ఎస్సి సెల్ ఆర్గనైసింగ్ సెక్రటరీ జయసూర్య అర్బన్ సిఐ, ఎస్ఐలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం నాడు నందికొట్కూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. దసరా పండగ రోజు అమ్మవారి ఫోటో, టిడిపి నాయకులు మాండ్ర శివానందరెడ్డి, గౌరు వెంకట్ రెడ్డిల ఫోటో ఏర్పాటు చేయడం జరిగిందని, కొందరు నాయకులు ఓర్వలేక ఫ్లెక్సీని చింపి వేయడం సరికాదన్నారు. ఈ ఘటనపై సిఐకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. నందికొట్కూరు పట్టణం లో గతంలో ఎన్నడూ ఇలాగ జరగలేదని కానీ కొందరు నాయకులు కావాల్సినే ఇలాంటి సంఘటనలు చేస్తున్నారని వారి పైన చట్టపరంగా చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడిపి నాయకులు జమీల్ బాష, మూర్తి జావలి, రసూల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- దేవాలయం స్థలాన్ని పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

పోలేరమ్మ దేవాలయం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పగిడాల రోడ్డులో గల పోలేరమ్మ గుడి స్థలాన్ని ఆక్రమణ స్థలాన్ని సిపిఎం నాయకులు షికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు పి. పకీర్ సాహెబ్ మాట్లాడుతూ నందికొట్కూరు గ్రామ పుట్టినప్పటి నుండి పోలేరమ్మ జాతరను అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఘనంగా జాతరను నిర్వహించుకోవడం జరుగుతోందని, అప్పటినుండి ఇప్పటివరకు ముఖ్యంగా పట్టణంలోని షికారులు ఇష్ట దైవంగా భావించి పోలేరమ్మ జాతరను జరుపుకోవడం ఆనవాతిగా జరుగుతుందన్నారు. పోలేరమ్మ గుడి స్థలాన్ని షేక్ మోజస్ భాష లాక్ డౌన్ సమయంలో దొంగ రిజిస్టర్ చేయించుకొని స్థలాన్ని ఆక్రమించుకోవడం జరిగిందనీ వారు ఆరోపించారు. ప్రభుత్వ రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి దొంగ రిజిస్టర్‌ను రద్దుచేసి పోలేరమ్మ దేవాలయానికి స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. షికారి స్వాములు, సిపిఎం నాయకులు స్థలాన్ని పరిశీలిస్తున్న విషయం తెలుసుకొని కబ్జా గురైన పోలేరమ్మ దేవాలయానికి ఎస్సై బివి రమణ తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని చేరుకొని భక్తులకు సర్ది చెప్పడంతో శాంతించ్చారు. బివి రమణ రిజిస్టర్ చేయించుకున్న వారిని స్టేషన్‌కు పిలిపించి డాక్యుమెంట్స్‌ను పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు రవి, ఆసిన్, కాలియా, నరసింహ, జగన్, వడ్డే నాగార్జున, వడ్డే శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయం స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

20న మొదటి కార్తీక సోమవారం

- భక్తులు దర్శించుకోవాలి : ఆలయ చైర్మన్, ఇఒ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరు మండలంలోని నల్లమల అడవిలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకార క్షేత్రంలో కొలువైన గంగ ఉమా సమేత ఓంకారేశ్వర స్వామి ఈనెల 20వ తేదీ నుండి మొదటి కార్తీక సోమవారం ప్రారంభమవు తుందని భక్తులు దర్శించుకోవాలని ఓంకార దేవస్థానం చైర్మన్ ఏ విశ్వనాథరెడ్డి, కార్యనిర్వహణాధికారి ఏ నాగ ప్రసాద్, పాలకమండలి సభ్యులు నారాయణ భక్తులకు సూచించారు. ఆదివారం వారు మాట్లాడుతూ కార్తీకమాసం సందర్భంగా అభిషేకములు కుంకుమార్చన 27వ తేదీ రెండో సోమవారము కార్తీక శుద్ధ పౌర్ణమి కేకములతో పాటు రాత్రి 9 గంటలకు నవమాంకములు అను డ్రామాను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 4వ తేదీ మూడవ సోమవారము తెల్లవారుజామున నుండి అభిషేకంలో జరుపబడును గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి ఐదు గంటల పది నిమిషములకు కళ్యాణం, డిసెంబర్ 11న నాలుగవ సోమవారం అభిషేకములు, క్షేత్ర ఉత్సవము జరుపబడునన్నారు. ఓంకార సిద్దేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఆర్టీసీ వారు బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తులకు, మహిళలకు స్థానమాచరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు, భక్తుల భోజన సదుపాయం కోసం కాశిరెడ్డి నాయన నిత్య అన్నసత్రం ఆర్యవైశ్య అన్న సత్రం నందు భోజన సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. కార్తీక మాసం పుణ్య మాసం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకోవాలని వారు కోరారు.

మాట్లాడుతున్న చైర్మన్, ఇఒ

డిసెంబర్ 8 నుండి నిరవధిక సమ్మె

ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ

ప్రజాశక్తి - నంద్యాల

అంగన్‌వాడీ కార్మికుల వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8 నుండి నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని ఏపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని రాణి మహారాణి ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిన్నటి రోజున కమిషనర్‌ని మూడు యూనియన్ల అధ్యక్ష కార్యదర్శులు గుంటూరు స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యాలయానికి వెళ్లి చర్చించినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. కావున డిసెంబర్ 8వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు అనుబంధ అంగన్వాడీ వర్కర్స్ మూడు యూనియన్ల ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ అంతా సమ్మెలో వెళ న్నామని అధికారులకు సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు. సమ్మె సన్నద్ధం కోసం ఈ నెల 20న జిల్లా పిడి, సిడిపిఒలకు సమ్మె నోటీసులు ఇస్తున్నామని, 23న ఆయా జిల్లా కేంద్రాల్లో కార్మిక, ప్రజా సంఘాలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాలు, 25 నుండి 30వ తేదీ వరకు సెక్టార్ సమావేశాలలో కార్మికులను సన్నద్ధం చేస్తామని తెలిపారు. డిసెంబర్ 6న బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సమ్మె నోటీసు అంబేద్కర్ విగ్రహానికి అందజేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు, ప్రజాప్రతినిధులకు సమస్యలతో కూడిన వినతి పత్రాలు కూడా అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు సరోజినమ్మ, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య, రమేష్ బాబు, బాలకృష్ణ, అబ్బాస్, భాస్కర్, శ్రీనివాసులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి కోలుకోలేక ఆదివారం మృతిచెందాడు. ద్వి చక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన నందికొట్కూరు నుంచి బొల్లవరం వెళ్లేదారిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపి వివరాల ప్రకారం నందికొట్కూరు పట్టణానికి చెందిన వీరప్ప(66) తన భార్య శివానందమ్మతో కలిసి ద్వీచక్రవాహనంపై బొల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళుతుండగా భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరి తలలకు తీవ్ర గాయాల య్యాయి. వెంటనే స్థానికులు, రోడ్ షేఫ్టీ పోలీస్ 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరప్ప (66) శనివారం అర్ధరాత్రి సమయంలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వీరప్ప (ఫైల్ ఫోటో)

ఆగిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - పగిడ్యాల

టైరు పంచరై మార్గం మధ్యలో ఆర్టీసీ బస్సులు అర్ధాంతంగా నిలిచిపో తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం ఉదయం 8:30 సమయాన ప్రాత కోట గ్రామం నుంచి నందికొట్కూరు మీదుగా కర్నూలుకు వెళ్లే బస్సు బావిదమ్మ బావి సమీపాన పంచరై ఆగిపోయింది. దీంతో వివిధ రకాల పనుల మీద వెళ్లే ప్రయాణికులు బస్సు మార్గం మధ్యలో నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంతో అవసరాల కోసం చేరాల్సిన సమయానికి గమ్యం చర్యలేక పోతామని ఆందోళన చెందారు. ఆర్టీసీ కాలం చెల్లి పోయిన బస్సులతో నడపడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వ పరం చేసినప్పటికీ ఏ మాత్రం మార్పు చెందలేదని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంలో విలీనమైన ఆర్టీసీని ఇంకా కాలం చెల్లిని బస్సులతోనే ఆర్టీసీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. కాలం చెల్లిన బస్సులకు కాలం చెల్లిన టైర్లు అమర్చడంతో ఎక్కడపడితే అక్కడ నిలిచిపోతున్నాయి. దీంతో ఆర్టీసీ సిబ్బంది నానా అవస్థలు పడడమే కాక ప్రయాణికులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీని విలీనం చేసినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ కాలం చెల్లిన బస్సులను తీసివేసి కొత్త బస్సుల్లో నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పంచరై మధ్యలో నిలిచిపోయిన బస్సు

మహిళా సాధికారతతోనే సమన్యాయం

5వ పేజీ తరువాయి... అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన పోటీ పరీక్షలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయం నంద్యాల వేదికగా నేడు సోమవారం ప్రముఖుల చేత బహుమతుల ప్రదానం, జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు తమీర్ భాష, శివ భాను, జగన్మోహన్, రవికుమార్, శివసాయి, హేమంత్, ప్రభాకర్, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** క్విజ్ పోటీలు మేధస్సును పెంచుతాయని ఆళ్లగడ్డ గ్రంథాలయాధికారిణి అరుణ కుమారి అన్నారు. ఆదివారం పట్టణంలోని గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని అంశాల్లో పరిజ్ఞానం కలిగి ఉంటేనే రాణించగలరన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే జనరల్ నాలెడ్జ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జనరల్ నాలెడ్జ్‌పై పట్టు సాధిస్తే విద్య, ఉద్యోగ రంగాల్లో విజయం సాధించవచ్చని చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే అంశాలకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న విజ్ఞానాన్ని మెరుగుపరిచే పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని యువతీ యువకులను కోరారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. **బనగానపల్లె :** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సేవలు మరువలేనివని వైయస్సార్ క్రాంతి పథకం కమ్యూనిటీ కోఆర్డినేటర్ ఎన్.హైమావతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు వి.చిట్టెమ్మ, సాలమ్మలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జలాల్ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దిశా చట్టం, మహిళా సాధికారికతపై చర్చ గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశానికి ప్రధానమంత్రిగా చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఇందిరాగాంధీని స్పూర్తిగా తీసుకొని మహిళలు ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం వైయస్సార్ క్రాంతి పథకం సిసి హైమావతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ లను గ్రంథాలయాధికారి జలాల్ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ లక్ష్మన్న, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీరాములు పాల్గొన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రి పట్టణంలోని మల్లెవేముల బస్టాండు సమీపంలో గల శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను గ్రంథాలయ అధికారి రామచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చెస్,క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. అలాగే భారతి విద్యా మందిరం పాఠశాలలో విద్యార్థులకు నృత్యం పోటీలను నిర్వహించారు. **పగిడ్యాల :** పగిడ్యాల గ్రంథాలయంలో ఆదివారం మహిళా దినోత్సవం గ్రంథాలయ అధికారి మద్దమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం సరోజినీ నాయుడు, ఇందిరా గాంధీ, మదర్ థెరిసా చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. **బండి ఆత్మకూర్ :** పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నప్పుడే విద్యార్థుల్లో పోటీ తత్వం పెంపొందించేందుకు వారిలోని వివిధ రకాల పోటీలను నిర్వహించడం ముఖ్యమని గ్రంథాలయ అధికారి మధు అన్నారు. కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉపాధ్యాయురాలు సుమలత హాజరయ్యారు. **పాములపాడు:** స్థానిక గ్రంథాలయం నందు గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీటీసీ నల్లమల రమాదేవి చిత్రపటానికి నివాళులర్పించారు. పాఠకులు వీరన్న, పిచ్చిరెడ్డి, పరమేష్, సుబ్బ రాయుడు, విజయ భాస్కర్, శివకృష్ణ, హనూక్, విద్యార్థులు పాల్గొనడం జరిగిందని గ్రంథాలయాధికారి కృష్ణారెడ్డి తెలిపారు.

బండి ఆత్మకూర్ : వక్తృత్వ పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని

పాములపాడు : ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

IN THE COURT OF SENIOR CIVIL JUDGE : DHONE
EP NO.01/2022 IN OS 538/2014

G.Jyothi. ...Transferee Decree Holder

V/s

1.P.Subbaiah. ...Original Decree Holder

2. B.Srinivasulu S/o Mahanandaiah,
aged about 53 years, Business
R/o H.No.8-1-169-21, Kothapeta,
Dhone town and mandal, Kurnool (Dt).
...Judgement Debtor

Notice to Judgement Debtor
U/o 21Rule 66 of C.P.C

పై తెలిపిన Transferee Decree Holder తన Transferee Decree Amount ను రాబట్టుకొనుటకు Judgement Debtor యొక్క Property ని వేలము వేయడానికి పై execution petition వేసి యున్నారు. పై execution petition 13-12-2023 తారీఖున పై కోర్టు నందు వేలము షరతులు నిర్ణయించడానికి వాయిదా కలదు. కావున Judgement Debtor అయిన మీరు ఉదయం 10-30 గంటలకు స్వతహాగా కాని **Advocate** ద్వారా కాని హాజరు కావలయును లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడం జరుగునని తెలియజేయడమైనది.

BY COURT ORDER
వాయిదా తేది : 13-12-2023

G.MADHUSUDHANA RAO
ADVOCATE FOR DECREE HOLDER,
DHONE, NANDYAL DIST.
CELL : 9441733503